APTEL/25/A2082

# పతాకం న్యూస్

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 135 | విశాఖపట్నం | 15-2-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :135 | VISAKHAPATNAM | 15-2-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902





2026-27 ఏపీ బడ్జెట్

**తిరోగమన బడ్జెట్ : శ్రీనివాసరావు** 2లో



**అప్పు ఎంత ఉందో చెప్పలేదు.. బడ్జెట్‌పై బుగ్గన విమర్శలు** 4లో



**ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు ఆహారంలో మార్పులు చేసుకోవాలి** 6లో




# 2026-2027 ఏపీ బడ్జెట్

# రూ.3.32 లక్షల కోట్లు

**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగుల పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పేర్కొన్నారు.

## బడ్జెట్ కేటాయింపులు

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు.

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు చేశారు.


## ఏపీ బడ్జెట్ స్వరూపం

| | |
|---|---|
| బడ్జెట్: | రూ.3,32,205 కోట్లు |
| రెవెన్యూ వ్యయం: | రూ.2,56,143 కోట్లు |
| మూలధన వ్యయం: | రూ.53,915 కోట్లు |
| రెవెన్యూ లోటు: | రూ.22,002 కోట్లు |

మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.

మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025-26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ (తరువాయి 2వ పేజీలో)

# మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వచ్చే 2-3 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. వైఎస్సార్సీపీ విధ్వంసం నుంచి కోలుకోవాలంటే ఇంకా సమయం పడుతుందని చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం మాటా మంతీ నిర్వహించారు. ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని, రాష్ట్రంలో సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని తెలిపారు. ఆదాయం తక్కువ-ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నామన్నారు. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలని, సేవా రంగంలోనూ ఆదాయం పెరగాలని చెప్పారు. మన రాష్ట్రంలో ఒంగోలు పాలకు, అనంతపురం పండుకు ఎంతో డిమాండ్ ఉందని చంద్రబాబు అన్నారు. ఈ రెండింటి రుచీ మరెక్కడా రాదని వెల్లడించారు. రెండు మూడేళ్ళలో అమరావతికి (తరువాయి 2వ పేజీలో)

# మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** 2026-27 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం శాసన మండలిలోనూ ప్రవేశపెట్టింది. హోం మంత్రి వంగలపూడి అనిత మండలిలో ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పలు రంగాలకు కేటాయించిన నిధులను, ప్రభుత్వ ప్రాధాన్యతలను సభా వేదికగా ప్రజలకు, సభ్యులకు వివరించారు. రూ.3,32,205 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్?ను మండలిలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వం చేస్తోన్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, హామీలను వివరించిన హోం మంత్రి వాటికి బడ్జెట్?లో చేసిన కేటాయింపులను వివరించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు (తరువాయి 3వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## మాయ!

కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ 2023-2024 సంవత్సర ప్రాతిపదికగా నిర్ణయించిన వినియోగదార్ల ధరల సూచీ ప్రకారం 2026 జనవరి నెల ద్రవ్యోల్బణం 2.75 శాతం మాత్రమేనని గురువారం చేసిన ప్రకటన మోసపూరితం. ఇప్పటివరకూ 2011-12 సంవత్సరం ప్రాతిపదికగా, 299 వస్తు సేవలను గణించగా ఇప్పుడు 358 వస్తు సేవల్ని గణిస్తున్నారు. అలాగే 12 నగరాల్లో ఇ- కామర్స్ అంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ ధరలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇలాంటివి బాగానేవున్నా ఆయా వస్తు సేవలకు సూచీ లెక్కింపులో ఇచ్చే వెయిటేజిలో చేసిన మార్పులు దారుణంగా వున్నాయి. ప్రజల జీవన ప్రమాణాల లెక్కింపులో ఆహార వినియోగం కీలకమైనది. ఆహార వస్తువుల ధరవరలకు గతంలో 42.617 గావున్న వెయిటేజిని ఇప్పుడు 36.753 కు తగ్గించడం అమానుషం. 'తిండి కలిగితె కండ గలదోరు- కండగలవాడేను మనిషోరు' అని మహాకవి గురజాడ ప్రబోధించగా నేటి మోడీ సర్కారు ' తిండి ఎందుకోరు' అనే పరిస్థితికి వచ్చింది. బియ్యం, గోధుమలు, వంట నూనెలు, ఉల్లిపాయలు, టమాటా ఇతర కూరగాయలు.. ఇలాంటివాటి ధరవరలనుబట్టి సామాన్యుల జీవనం ఆధారాపడి వుంటుందన్న విషయం అందరికీ తెలిసిందే! కానీ కేంద్ర ప్రభుత్వం వాటి వెయిటేజిని తగ్గించడం ద్వారా తాము పేద, మధ్యతరగతి ప్రజల కోసం కాకుండా ఉన్నత, సంపన్న వర్గాల కోసమే పాలిస్తున్నామని చెప్పకనే చెప్పినట్టే. అలాగే మనిషి కనీసావసరాల్లో కూడు తరువాతిది గుడ్డ. కానీ కేంద్ర ప్రభుత్వం బట్టలు, చెప్పులకు కూడా గతంలోని 6.527 వెయిటేజి 3.383 కి తగ్గించింది. ఇప్పుడు వారు వీరని కాకుండా అందరూ చదువు'కొన' లేకపోతున్నామనే ఆవేదన పడుతున్నారు. అలాంటప్పుడు చదువుల ఖర్చు వెయిటేజిని 3.513 నుండి 3.333 కి తగ్గించడం అన్యాయం. ఇటువంటి కీలక అవసరాలకు వెయిటేజి తగ్గించిన సర్కారు పాన్, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాల వెయిటేజిని 2.38 నుండి 2.989 కి పెంచడాన్ని ఏమనుకోవాలి? కాబట్టి సర్కారువారి ప్రాధాన్యతా క్రమం ఏమిటో సుస్పష్టం. గత ఏడాది జనవరి ద్రవ్యోల్బణం 4.26 శాతం కాగా కొత్త ప్రాతిపదికలనుబట్టి ఇప్పుడది 2.75 అని చెబుతున్నారు. అదే 2011-12 ప్రాతిపదిక అయితే మాత్రం ద్రవ్యోల్బణం పెరిగింది. కానీ ప్రభుత్వం అధికారికంగా మార్చిన సూచీని బట్టి ప్రకటిస్తుంది కనుక ద్రవ్యోల్బణం తగ్గినట్టే లోకాన్ని నమ్మిస్తోంది. ఈ మాయాజాలాన్ని ప్రజలు అర్థం చేసుకోలేరని, ద్రవ్యోల్బణం తగ్గిపోతోందని అందరినీ భ్రమ పెట్టడానికి సర్కారు చేస్తున్న యత్నాలివి. ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించే జీత భత్యాలు, డిఎ, డిఆర్ లెక్కింపునకు తాజా సూచీనే ప్రాతిపదికగా ఉంటుంది. పారిశ్రామిక కార్మికుల కనీస వేతనాలు, వేరియబుల్ డిఎ వంటి వాటికీ ఇదే ప్రాతిపదిక. సాధారణంగా ఊదరగొట్టే అభివృద్ధి గణాంకాలకూ ఇదే కొలబద్ద! కాబట్టి వాస్తవ పరిస్థితి కాకుండా ప్రభుత్వం కోరుకున్న రీతిలో గణాంకాలు వెల్లడి కావడమే కాకుండా శ్రమ జీవులకు తీరని నష్టం జరుగుతుంది. ఒక గీతను చెరపకుండా చిన్నది చెయ్యాలంటే దాని పక్కనే మరో పెద్ద గీత గీసెయ్యడమేనని అందరికీ తెలిసిన విషయమే! కేంద్ర ప్రభుత్వం సరిగ్గా ఇప్పుడు అదే చేస్తోంది. ప్రాతిపదిక సంవత్సరాన్ని మార్చడం తాజా పర్చడానికి అనడం, ఆహార ధాన్యాల వెయటేజి తగ్గించి, వినిమయ వస్తువులకు పెంచడం, సామాన్యుల వినియోగ సరళికి కాకుండా ఉన్నత, సంపన్నవర్గాల వినియోగ సరళికి ప్రాధాన్యతనివ్వడం వంటివి ప్రజలను మభ్యపుచ్చడానికి చేసిన కుట్ర. ప్రధానిగా నరేంద్ర మోడీ గద్దెనెక్కినప్పటి నుండీ లేని అభివృద్ధిని చూపించడానికి తహతహలాడడం జగమెరిగిన సత్యం. అంతేగాక ప్రణాళికా విధానమంటే బిజెపి కి గిట్టదు. అందుకనే రాజ్యాంగబద్దమైన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్ పేరిట ఒక జేబు సంస్థను తీసుకొచ్చారు. ప్రణాళికకు గణాంకాలు ప్రాణప్రదమైనవి. కాబట్టి వాటి ఉసురు కూడా తీసెయ్యాలన్నది గత దశాబ్ద కాలంగా జరుగుతున్న దుష్ట యత్నం. మోసపూరితమైన ఈ కార్పొరేట్ మతత్వ కూటమి విధానాలను, వాటి మాటున జరుగుతున్న హానినీ జనం అర్థం చేసుకోవాలి. అప్పుడే పాలకుల కుట్రలను తిప్పికొట్టేలా వేగంగా ప్రజా ఉద్యమాలు సాధ్యమవుతాయి.

## బాధ్యతలు చేపట్టిన గంటల్లోనే ఏసీపీ బదిలీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో అరుదైన మరియు అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఒక ఉన్నతాధికారి బదిలీపై వచ్చి, బాధ్యతలు స్వీకరించిన 24 గంటలు కూడా గడవకముందే తిరిగి పాత స్థానానికే పంపబడటం ఇప్పుడు పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (SDPO)గా పనిచేస్తున్న 1991 బ్యాచ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. వివేకానందను విశాఖపట్నం సిటీ హార్బర్ ఏసీపీగా బదిలీ చేస్తూ మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అధ్యక్షతన జరిగిన పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర్వుల ప్రకారం, వివేకానంద గురువారం ఉదయం విశాఖ హార్బర్ ఏసీపీగా బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే, అదే రోజు రాత్రి సీన్ రివర్స్ అయింది. ఉత్తర్వులను రద్దు చేస్తూ డీజీపీ కార్యాలయం మరో కొత్త ఉత్తర్వును విడుదల చేసింది. అందులో వివేకానందను తక్షణమే విశాఖ నుండి రిలీవ్ అయి, తిరిగి శ్రీకాకుళం SDPOగా రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఉన్న టి. చిట్టిబాబును హార్బర్ ఏసీపీగా నియమించారు.

## 2026-27 ఏపీ బడ్జెట్ తిరోగమన బడ్జెట్ : శ్రీనివాసరావు




**విజయవాడ, పతాకం న్యూస్:** 2026-27 రాష్ట్ర బడ్జెట్ తిరోగమన బడ్జెట్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనికి సంబంధించి శనివారం శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, సామాజిక న్యాయానికి తోడ్పడే విధంగా లేదని అన్నారు. ముఖ్యమంత్రి చెబుతున్న "వికసిత ఆంధ్రప్రదేశ్" మాటల్లో గొప్ప-చేతల్లో శూన్యంలాగా ఉందని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ అమల్లో మిగిలిపోయిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్ పట్టించుకోలేదని అన్నారు. రూ.75 వేల కోట్లు లోటు పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని చెప్పారు. మొత్తం మీద ఈ బడ్జెట్ తిరోగమనం దిశలో ఉందని స్పష్టం చేశారు. ఈ రెండు సంవత్సరాలలో క్రమంగా ఆదాయం పడిపోతున్నదని శ్రీనివాసరావు వివరించారు. అభివృద్ధి ఉంటే ఆదాయం పెరగాలి... కానీ రాష్ట్ర స్వంత పన్ను ఆదాయం తగ్గిందంటే అర్థం ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయనే అని స్పష్టం చేశారు. కేంద్ర నుండి రావాల్సిన గ్రాంటు, పన్నుల వాటా (జిఎస్టీ) తగ్గిందని, డబుల్ ఇంజన్ సర్కారు భాగోతం దీనితో బట్టబయలవుతున్నదని అన్నారు. పెట్టుబడి వ్యయం బాగా తగ్గింది ... అంటే అభివృద్ధి తిరోగమనంలో ఉందనే అర్థం అని చెప్పారు. పెట్టుబడి పద్దు కింద రూ.98 వేల కోట్లు చూపించగా ఇందులో రూ.76 వేల కోట్లు బహిరంగ మార్కెట్‌లో తెచ్చే అప్పులేనన్నారు. స్థూల జాతీయోత్పత్తిలో 36 శాతం అప్పులే ఉన్నాయన్నారు. బడ్జెట్‌లో 18 శాతం వడ్డీలకే సరిపోతున్నదని చెప్పారు. ఈ భారం మొత్తం ప్రజల మీదే పడుతుంది... కానీ పెట్టుబడి వ్యయం రూ.48,697 కోట్లు కేటాయించారు... అంటే మిగతా అప్పు మొత్తం ఎక్కడకు పోతున్నదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి అని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అభివృద్ధి చేయడంలో విఫలమై ఆ బాధ్యత పిపిపి పేరుతో ప్రయివేటు రంగంపై నెట్టిందన్నారు. ప్రయివేటు పెట్టుబడులు దేశంలోనే తిరోగమనంలో ఉన్నాయన్నారు. విదేశీ పెట్టుబడులు వెనక్కిపోతున్నాయన్నారు. ఇంటికొక పారిశ్రామికవేత్త నినాదం ఆశాజనకంగా లేకపోగా చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం లేదు అని చెప్పారు. ప్రభుత్వ విధానాలు ఇంటికొక నిరుద్యోగిని సృష్టించాయని అన్నారు. ఆర్థిక మంత్రి ఉపన్యాసం ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా అరచేతిలో వైకుంఠం చూపించారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయానికి 4 శాతం మాత్రమే కేటాయించి రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి బడ్జెట్ 1 శాతం లోపే ఉందన్నారు. మిగతా అంతా యంత్రాంగం నిర్వహణకే పోతున్నదని చెప్పారు. ఒకవైపు చీనీ చెట్లు, అరటి, ఇతర పండ్ల రైతులకు గిట్టుబాటు ధర రాక చెట్లు పీకేస్తుంటే ఉద్యానవన పంటలకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పంటల భీమాను రైతులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు అని తెలిపారు. ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్లు అవసరం కాగా రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడం వ్యవసాయం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నదని అన్నారు. ఇరిగేషన్‌కు దాదాపు పెరుగుదల లేదనీ, కౌలు రైతులను పట్టించుకోలేదు అని చెప్పారు. గ్రామీణాభివృద్ధికి 8.3 శాతం నుండి 7.4 శాతానికి అంటే దాదాపు 1 శాతం తగ్గిందన్నారు. వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు అదనపు నిధులు కేటాయించలేదని చెప్పారు. ఆ లెక్కన ప్రాజెక్టులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు అని అన్నారు. వెలిగొండ, హంద్రీనీవా, వంశధార తదితర ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడానికి నిధులు పెంచాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు ఎంత కేటాయించారో స్పష్టత లేదు అని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయిందని ఇప్పటిదాకా చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు 60 శాతం మాత్రమే పూర్తయిందని చెప్పడం వారి వాగాడంబరాన్ని బట్టబయలుచేసిందని శ్రీనివాసరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ రంగానికి రూ.15 వేల కోట్ల నుండి రూ.14 వేల కోట్లకు తగ్గించారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడానికే బడ్జెట్‌లో నిధులు కోత పెట్టినట్లు కనిపిస్తున్నదన్నారు. విద్యారంగానికి పెద్ద పీట వేస్తామని ఘనంగా ప్రకటించినా మొత్తం బడ్జెట్‌లో విద్యకు 10.8 శాతం నుండి 10.5 శాతానికి తగ్గిందని... ఇప్పటికే 1400 స్కూళ్ళు మూసివేశారని, కొత్తగా స్కూళ్ళు పెట్టలేదనీ, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రస్తావన లేదు అని వివరించారు. సంక్షేమానికి 17.3 శాతం నుండి 16 శాతానికి తగ్గిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపు లేదు అని చెప్పారు. అంగన్‌వాడీ, ఆశా తదితర స్కీం వర్కర్స్‌ను పొగడడం తప్ప జీతాల పెంపుదల గురించి మాట్లాడలేదు అని తెలిపారు. ఇలా ప్రజలకు, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే అనేక పద్దుల్లో కోత విధించడం రాష్ట్రాభివృద్ధిని నిరాశలో ముంచిందని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## రూ.3.32 లక్షల కోట్లు

ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.

**పన్నుల ద్వారా ఆదాయం:** 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం - 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు - 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా -19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ - 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం -17 శాతం, విద్య -11 శాతం, ఆర్థికం - 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి -7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం -6 శాతం, జలవనరులు - 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్- 4 శాతం, విద్యుత్ రంగం -4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు -4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) - 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు -18 శాతంగా పేర్కొన్నారు.

**రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు:** రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం -38 శాతం, పన్నేతర ఆదాయం - 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు - 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా -19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్-10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య -11 శాతం, ఆర్థికం-8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి-7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం-6 శాతం, జలవనరులు- 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ - 4 శాతం, విద్యుత్ రంగం - 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు -4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) -15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు - 18 శాతం జరుగనున్నాయి.

**ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం:** ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్‌లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు. గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్దరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కి కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కి నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు. సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్‌తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్‌లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

## మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ఒక రూపు వస్తుందని తెలిపారు. అమరావతి దారుల్ని జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని, అమరావతికి రాకపోకలు పెరిగి ఆదాయమూ వస్తుందని వివరించారు. అమరావతికి పశ్చిమ బైపాస్ వల్ల యాక్సిస్ పెరిగిందన్న సీఎం, ఇన్నర్ రింగ్, ఔటర్ రింగ్ రోడ్డుతో మరింత పెరుగుతుందని అన్నారు. రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలు అంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఒక్కప్పుడు పశువులకు నీరు కూడా రాయలసీమలో దొరికేది కాదని గుర్తుచేశారు. రాయలసీమకు రైలులో పశుగ్రాసం, నీళ్లు తరలించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. 2014-19 మధ్య రైన్ గన్స్‌తో పంటలను కాపాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అప్పుడే హంద్రీనీవాను సీరియస్‌గా తీసుకున్నామన్న చంద్రబాబు, ఆ ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. దేశంలోనే ఉత్తమమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయని, అక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని వెల్లడించారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నానని సీఎం తెలిపారు. 95-96 మాదిరిగానే నిక్కచ్చిగా ఉంటానన్న చంద్రబాబు, మారకపోతే వాళ్లకే నష్టమన్నారు. మొత్తం 9 పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నానన్నారు. వారికి తెలియని ఇంకొన్ని పేరామీటర్లు కూడా తనవద్ద ఉన్నాయన్నారు. లోకేశ్ తన పని తాను చేస్తున్నానని అన్నారు. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్ రెండూ భయం-భక్తీలా ఉండాలని స్పష్టం చేశారు. మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ కల్పిస్తున్నారని ప్రశంసించారు. బడ్జెట్ వేళ మహిళా ఎమ్మెల్యేలంతా ఒకే రకమైన చీరలతో రావటం ఐక్యతకు నిదర్శనంగా బాగుందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఇది ప్రజా బడ్జెట్, పేదల సంక్షేమ బడ్జెట్, రైతన్నకు మేలు చేసే బడ్జెట్, విద్య, వైద్యానికి ప్రాధాన్యత నిచ్చే బడ్జెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమ బడ్జెట్ ఇది. రూ.3,32,205 కోట్ల బడ్జెట్ అని మంత్రి గుమ్మడి సంధ్యరాణి కొనియాడారు. దేశ అభివృద్ధికి బడ్జెట్ ఒక ముఖ్యమైన పునాది అని, ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో చంద్రబాబుని నమ్మి ఓట్లు వేసి అధికారంలోకి తెచ్చారో, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని గర్వంగా చెప్పగలనన్నారు. తన రెండు శాఖలకు కేటాయించిన నిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ సంక్షేమానికి 9,190 కోట్లు, మహిళా సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించారన్నారు. ఇది సాధారణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడిన సమతుల్యమైన ఆర్థిక ప్రణాళికగా నిలిచిందని తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు.

# మాకవరపాలెంలో మండలంలో నాలుగు గ్రామాల్లో 5వేల ఎకరాల కోసం సర్వే



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** మాకవరపాలెం మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేయాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ఎంఎస్ఎంఈ పార్కును మంజూరు చేసి భూములు కేటాయించింది. ప్రైవేటు రంగంలో ఎర్త్ మూవర్స్ కంపెనీ 'డోక్సో'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటు కోసం అవసరమైన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. దీంతో రెవెన్యూ అధికారులు కొద్ది రోజుల నుంచి పలు గ్రామాల్లో సర్వే జరుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ల్యాండ్ బ్యాంకు కింద ప్రభుత్వ భూములతోపాటు డి.పట్టా భూములను గుర్తించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో మాకవరపాలెం మండలంలో సుమారు ఐదు వేల ఎకరాలను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమై వున్నారు. మండలంలో పైడిపాల, పెద్దిపాలెం, పాపయ్యపాలెం, బూరుగుపాలెం గ్రామాల్లో గత వారం రోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. పైడిపాల, పెద్దిపాలెం గ్రామాల్లో సుమారు 2,100 ఎకరాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. మిగిలిన గ్రామాల్లో సర్వే కొనసాగుతున్నది.

# ఇతర రాష్ట్రాలకు పశువులను అక్రమంగా తరలిస్తున్నాడని శేఖర్‌పై పోలీసులకు ఫిర్యాదు




**నక్కపల్లి, పతాకం న్యూస్:** కుటుంబపోషణ కోసం పశుపోషణ రైతులు, పశువుల వ్యాపారుల వద్ద కూలీలు పనిచేస్తున్న తమను తగరపువలసకు చెందిన శేఖర్ అనే వ్యక్తి నమ్మించి, ఆధార్ కార్డులు తీసుకొని, ఇతర రాష్ట్రాలకు పశువులను అక్రమంగా తరలిస్తున్నాడని పలువురు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు పశువుల సంతల్లో కూలీలుగా పనిచేస్తున్న దేవర నాగేశ్వరరావు, కె.దుర్గాప్రసాద్, బర్ల శ్రీను, డి.లక్ష్మణ్, కె.తాతాజీ, రామ్ ప్రసాద్ నేతృత్వంలో పలువురు నక్కపల్లి వచ్చిన నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 150 మంది పలు పశువుల సంతల్లో దాదాపు పదేళ్ల నుంచి కూలీలుగా పనిచేస్తున్నారు. సంతల్లో రైతులు కొనుగోలు చేసిన పశువులను వాహనాల్లోకి ఎక్కించి సదరు రైతుల గ్రామాలకు తీసుకెళ్లి అప్పగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తగరపువలసకు చెందిన శేఖర్ అనే వ్యక్తి వీరితో పరిచయం పెంచుకున్నాడు. ఇతను కొత్తవలస, పెదమానాపురంతోపాటు ఒడిశాలోని సంతల్లో పశువులను కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలించమని వీరికి చెప్పేవాడు. ఇందుకు నిర్ణీత మొత్తాన్ని కూలి రూపంలో తీసుకొనేవారు. ఈ క్రమంలో వీరి ఆధార్ కార్డులను తీసుకొన్నాడు. వీటిని అడ్డంపెట్టుకొని భారీ ఎత్తున పశువులను కొనుగోలు చేస్తూ కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కబేళాలకు తరలిస్తున్నాడు. కొంతకాలం తరువాత ఈ విషయం తెలుసుకొని, అతని వద్ద పని మానేశారు. తరువాత ఒక సంతలో పశువులను కొనుగోలు చేసి, మరో సంతలో మారుబేరానికి విక్రయించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. దీంతో కక్షగట్టిన శేఖర్.. వీరు పశువులను రవాణా చేసే వాహనాలను తన అనుచరులతో అడ్డుకొనేవాడు. తనకు ఒక్కో వాహనానికి రూ.7-9 వేలు ఇవ్వాలని, లేకపోతే పోలీసులకు పట్టిస్తానని బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. ఆధార్ కార్డులను దుర్వినియోగం చేస్తూ, పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న శేఖర్, అతని ముఠాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఇందుకు సంబంధించి కొన్ని ఆధారాలను డీఎస్పీకి, సీఐకి అందజేశారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

# కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కిలపర్తి కృష్ణ బాధ్యతలు స్వీకరణ



**కె.కోటపాడు, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా, మాడుగుల నియోజకవర్గం లోని కే. కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కిలపర్తి కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా ఇక్కడ పనిచేస్తున్న సిఐ పైడపు నాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు. పైడపు నాయుడు విశాఖ బదిలీపై వెళ్లారు. సిఐగా బాధ్యతలు స్వీకరించిన కిలపర్తి కృష్ణను నియోజకవర్గంలో 4 మండలాల నాయకులు, కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎటువంటి అసంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా పనిచేస్తానని, ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఈ సందర్భంగా సిఐ కిలపర్తి కృష్ణ విలేకరులకు తెలిపారు.

# ఆర్లి గ్రామంలో వైభవంగా శ్రీ సీతారాముల తీర్థ మహోత్సవం



**కె.కోటపాడు, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా కె. కోటపాడు మండలం, ఆర్లి గ్రామంలో శనివారం అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల తీర్థ మహోత్సవం జరిపారు. ఉదయం నుంచి భక్తులు రాములవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బోలెం బుల్లిదొర, బోలెశీ కృష్ణారావు, సర్పంచ్ బోలేం సత్యనారాయణ (సందీప్) గ్రామ టిడిపి అధ్యక్షులు బండారు నారాయణమూర్తి, టిడిపి యువత నాయకుడు బండారు దొరబాబు, బండారు కిషోర్, బోలెశీ సత్యనారాయణ (కవి) బోలెంసత్యనారాయణ మూర్తి (ఎల్ఐసి) బండారు అక్కన్నపాత్రుడు, బండారు పెద్ద పాపిరాజు, బోలెం మూర్తి, బండారు శ్రీనివాసరావు, తదితర యువత పెద్దలు పాల్గొన్నారు.

# మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనిత

(మొదటిపేజీ తరువాయి)

రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు. వ్యవసాయ బడ్జెట్?ను శాసన మండలిలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసన మండలిలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించిన నిధులు, ప్రాధాన్యతలను వివరించారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు బడ్జెట్?లో రూ.53,752.12 కోట్లు కేటాయించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లు ప్రవేశపెట్టాక మండలి సమావేశాలను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేస్తూ ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రకటించారు.

# శ్రీరాపురం గ్రామం చెక్ పోస్ట్ వద్ద రూ.25 లక్షల గంజాయి పట్టివేత




- **ముగ్గురు యువకులు అరెస్ట్**
- **చాకచౌక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్ఐ సత్యనారాయణ**

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** కొత్త రూట్లో ఎంచుకొని మరి సినిమాను తలపించే విధంగా గంజాయిని మరిగించి లిక్విడ్ లాగా తయారుచేసి పట్టుకెళ్తున్నట్టు సమాచారం ముందుగానే రావటంతో వెంటనే తేరుకొని దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ శ్రీరాంపురం చెక్ పోస్ట్ దగ్గర పట్టుకోవడం జరిగింది. అందులో రెండు కేజీలు గంజాయి లిక్విడ్, కేజీ హాశిష్ ఆయిల్ , ఉన్నట్టు గుర్తించిన ఎస్సై మరియు పోలీస్ సిబ్బంది.. వివరాల్లోకి వెళితే .. ఈరోజు ఉదయం విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం రావడంతో దేవరాపల్లి ఎస్సై శ్రీరాంపురం చెక్ పోస్ట్ దగ్గర పోలీస్ సిబ్బందితో కలిసి అనుమానం తోటి ముగ్గురు యువకులు పల్సర్ బైక్ మీద వెళుతున్నట్టు గుర్తించి చాకచౌక్యంగా పట్టుకున్నారు.. పట్టుకున్న ముగ్గురు యువకుల్ని బ్యాగులు చెక్ చేయగా రెండు కేజీలు లిక్విడ్ గంజాయి, ఒక కేజీ హసీష్ ఆయిల్ దానితోపాటు పల్సర్ బైకు మూడు సెల్ ఫోన్లు పట్టుకొని వారిని మీడియా ముందు ఉంచి అరెస్టు చేశారు. దేవరాపల్లి ఎస్సై, పోలీస్ సిబ్బంది మరియు సిఐ సమక్షంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి పట్టుబడిన యువకులు రంజాన్ మన్సారి 23 సంవత్సరాలు మహారాష్ట్ర వాసిగా, గోల్లోరి ధనీష్ డుబ్బిరిగూడేశీ మండలం అల్లూరి సీతారామరాజు జిల్లా మరో యువకుడు అదే మండలానికి చెందిన పాంగి దేవదాసుగా గుర్తించారు వాళ్ల దగ్గర ఉన్న బైకు, మూడు సెల్ ఫోన్లు,3000రూ నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఈ కేసులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్బున్స్ యాక్ట్ 1985, (నూప్స్ యాక్ట్) లోని సెక్షన్లు కింద కేసు నమోదు చేసి ముద్దాయిలని న్యాయం స్థానానికి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు చోడవరంలో హాజరు పరుస్తామని మీడియా సమావేశంలో చెప్పారు.

ప్రజలకు మరియు దారి తప్పుతున్న యువతకు అనకాపల్లి జిల్లా పోలీసు అధికారులు తెలియజేసింది ఏమనగా ప్రజలకు దారి తప్పుతున్న యువతకు విజ్ఞప్తి చేస్తూ మత్తు పదార్థాలు గంజాయి లాంటి అక్రమ రవాణా వినియోగంపై కఠిన చర్య తీసుకుంటామని ఇలాంటి కార్యక్రమాలు, కార్యక్రమాలపై సమాచారం ఉన్నవారు వెంటనే స్థానిక సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ కి తెలియపరచవలసిందిగా కోరుచున్నామని అనకాపల్లి పోలీస్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు... భవిష్యత్తును పాడు చేసుకోవద్దు , మిమ్మల్ని కన్న తల్లిదండ్రుల కోసం బ్రతకండి, తలెత్తుకునేలా బ్రతకండి మత్తుకు బానిసవకండి , లేవండి మంచి సమాజం కోసం , సమాజ హితం కోసం మనల్ని మనం కాపాడుకునే విధంగా మన బ్రతుకులను మనమే బాగు చేసుకునే విదంగా బ్రతకండి అని దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ తెలియజేశారు.

# అనకాపల్లి ప్రజా ప్రతినిధులకు లోకేశ్ ఆత్మీయ విందు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబ సభ్యులకు విందు ఇచ్చారు. ప్రత్యేక ఆహ్వానం మేరకు తన ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరినీ లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు. ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గతంలో వివిధ సందర్భాల్లో ఇచ్చిన వినతుల పరిష్కారం ఏ దశలో ఉన్నాయో లోకేశ్ వివరించారు. అందరూ ఒకచోట కూర్చొని కొద్దిసేపు సరదా సంభాషణలతో గడిపారు. అనంతరం అంతా కలిసి విందు ఆరగించారు. ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు మంగళగిరి చేనేత చీరలను లోకేశ్ బహూకరించారు. ఆత్మీయ సమావేశం ముగిసిన తరువాత అందరినీ గేటు వరకు సాగనంపారు. లోకేశ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్, మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

# కల్యాణపులోవలో మూడు రోజులపాటు ఉత్సవాలు



**రావికమతం, పతాకం న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవలో పోతురాజుబాబు, పెద్దింటమ్మ వార్ల ఉత్సవాలను ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించేదుకు అధికారులు, ఉత్సవ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల నుంచి సుమారు మూడు లక్షల భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే రాజు ఆదేశాల మేరకు పలు శాఖల అధికారులు గత వారం రోజుల నుంచి ఇక్కడ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయ పరిసరాల్లో సుమారు 45 ఎకరాల్లో తుప్పలు తొలగించి, ఎత్తు పల్లాలను సరిచేయించారు. ఆలయం సమీపానికే వాహనాలు వచ్చేలా రింగ్ రోడ్డు నిర్మించారు. ఉచిత ప్రసాదాల పంపిణీకి 28 కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో వుండే భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు వేశారు. డీసీసీబీ సహకారంతో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయనున్నారు. ఆదివారం భక్తులు జాగారం చేయనుండడంతో అడుగడుగునా విద్యుత్ దీపాలను అమర్చారు. రిజర్వాయర్‌లో పుణ్యస్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వద్ద బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో వుంచుతున్నారు. నాలుగుచోట్ల వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి 80 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో, జలాశయం వద్ద 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దొండపూడి ఠాణా నుంచి కల్యాణపులోవ వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసేందుకు పలుచోట్ల పోలీసు బీట్‌లను ఏర్పాటు చేశారు. ఆటోలు, వ్యాన్లు, ఇతర భారీ వాహనాలను, దొండపూడి ఠాణా వద్దే నిలిపివేస్తారు. భక్తులు ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లవచ్చు. ఆయా ఏర్పాట్లను నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ,కొత్తకోట సీఊ కోటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

# ఆఫ్‌లైన్‌లో కూడా ఏకీకృత కుటుంబ సర్వే



**పాడేరు, పతాకం న్యూస్:** అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింత పగడ్బంధీగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏకీకృత కుటుంబ సర్వే ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎట్టకేలకు జోరందుకుంది. గతంలో ఇంటర్నెట్ సమస్యల కారణంగా సర్వే ప్రక్రియ సక్రమంగా సాగలేదు. దీంతో ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆఫ్‌లైన్‌లో సైతం కుటుంబ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో మారుమూల పల్లెల్లో సైతం సర్వే నిర్వహణకు సమస్యలు తొలగినట్టేనని సిబ్బంది అంటున్నారు. దీంతో పల్లెల్లో అవసరమైన ఆయా కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యాప్‌లో ఆఫ్‌లైన్‌లోనే నమోదు చేసుకుని, ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ప్రాంతాలకు వచ్చి, ఆయా సమచారాన్ని ఆన్‌లైన్‌లో యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చును.

## కాంట్రాక్టు కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం



**సీలేరు, పతాకం న్యూస్:** సీలేరు జలవిద్యుత్ కేంద్రం ఓడీ యార్డులో విద్యుదాఘాతంతో మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుడు గంగిరి గణేశ్ కుటుంబానికి పది లక్షల రూపాయల పరిహారం ఇచ్చేందుకు జెన్‌కో అధికారులు అంగీకరించారు. సీఐటీయూ, సీపీఎం, స్థానిక కూటమి నాయకులు కలిసి స్థానిక జెన్‌కో అధికారులతో సమావేశమయ్యారు. అన్‌స్కిల్డ్ లేబర్‌ను ఓడి యార్డులో 220 కేవీ లైన్‌పై ఎలా పనిచేయించారని వారంతా అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులకు ఇన్సూరెన్స్ ఎందుకు చేయించలేదని నిలదీశారు. దీనికి జెన్‌కో అధికారులు బాధ్యత వహించాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తల్లికి పింఛన్ ఇప్పించాలని జెన్‌కో అధికారులను డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జలవిద్యుత్ కేంద్రంలో పనిచేసే ప్రతీ కాంట్రాక్టు కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఈ మేరకు జెన్‌కో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మిక, కూటమి నాయకులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. చివరకు బాధితుడి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం, అంత్యక్రియలకు రూ.50 వేలు, ఇంట్లో ఒకరికి కాంట్రాక్టు లేబర్ ఉద్యోగం ఇవ్వడానికి జెన్‌కో అధికారులు అంగీకరించారు. ఎటువంటి సేఫ్టీ చర్యలు తీసుకోకుండా పనులు చేయించిన సంబంధిత జెన్‌కో ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూసీ నాయకులు జెన్‌కో అధికారులను డిమాండ్ చేశారు. దీనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా విధుల్లో ఉన్న ఉద్యోగులు, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని జెన్‌కో అధికారులు హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో జెన్‌కో తరుపున ఎస్‌ఈలు చిన్నకామేశ్వరరావు, సీహెచ్ హనుమ, ఈఈలు బాలకృష్ణ, రాజేంద్రప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, సీఐటీయూ తరుపున జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, రాష్ట్ర సభ్యుడు చింతా రాంబాబు, సీలేరు బ్రాంచి గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సుభాన్, అధ్యక్షుడు బి. లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్‌రాజు, కూటమి నాయకులు సీహెచ్ రాము, రమణ, గోవింద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ పాల్గొన్నారు. తమ కుమారుడు గంగిరి గణేశ్ మృతి చెంది 24 గంటలు పైగా కావస్తున్నా పోస్టుమార్టం నిర్వహించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ మృతుడు కుటుంబ సభ్యులు జెన్‌కో డీఈ కార్యాలయం ముందు బైఠాయించారు. కనీసం మృతదేహాన్ని కడసారిగా విలపిద్దామన్నా అధికారుల నిర్లక్ష్యంతోనే పోస్టుమార్టం జాప్యం జరుగుతుందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. చర్చలు పూర్తయిన తర్వాత శుక్రవారం సాయంత్రం మృతదేహానికి పోస్టుమార్టం చేసి అక్కడ ఉన్న వారి బంధువులకు అప్పగించడంతో జెన్‌కో అంబులెన్స్‌లో మృతదేహాన్ని సీలేరు తరలించారు.

## నేడు ఆర్కే బీచ్‌లో మహా శివరాత్రి వేడుకలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఏటా మాదిరిగానే ఈ నెల 15న మహా శివరాత్రిని పురస్కరించుకుని టీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ భారత యజ్ఞపీఠం ప్రతినిధి, ఉత్సవ నిర్వాహకులు రత్నాల చంద్రశేఖర్ తెలిపారు. సిరిపురంలోని టీఎస్ఆర్ బంగ్లాలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం భక్తులతో స్వయంగా పవిత్ర జలాలు, పండ్ల రసాలతో శివలింగానికి అభిషేకాన్ని టీఎస్ఆర్ చేయించనున్నట్టు వెల్లడించారు. ఉత్సవ కన్వీనర్, తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ మాట్లాడుతూ విశాఖ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ ప్రాంతానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లకూడదన్న ఉద్దేశంతో ఏటా టీఎస్ఆర్ మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారన్నారు. టీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి ఎస్‌కే బాషా మాట్లాడుతూ భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్లు, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో పేడాడ రమణకుమారి, జీవీ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు.. బడ్జెట్ పై బుగ్గన విమర్శలు



**అమరావతి, పతాకం న్యూస్:** బడ్జెట్ పై బుగ్గన వివిపీ శాసనసభలో ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు.

తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## టెన్త్ విద్యార్థులకు పక్కాగా 100 రోజుల ప్రణాళిక అమలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యా శాఖాధికారులు ముందుకు వెళుతున్నారు. అన్ని పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా డిసెంబరు ఆరో తేదీ నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. 226 మంది ఉపాధ్యాయులను పరిశీలకులుగా నియమించి ప్రత్యేక బోధన చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాన్నిబట్టి రైజింగ్ స్టార్స్, షైనింగ్ స్టార్స్‌గా విభజించారు. మార్చి 16వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. సమయం దగ్గర పడుతుండడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణులు కావడానికి ప్రత్యేక బోధన చేస్తున్నారు. గత ఏడాది వారానికి ఒకసారి పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది రోజూ పరీక్ష నిర్వహిస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా 70 రోజుల అనంతరం ప్రతి పాఠశాలలో ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విద్యార్థులను విభజించారు. సీ, డీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈనెల 9వ తేదీ నుంచి వీరి కోసం ప్రత్యేకంగా 30 రోజుల ప్రణాళకను అమలు చేస్తున్నారు. డీ కేటగిరీకి చెందిన 250 బాలురు, 52 మంది బాలికలను సమీపంలోని వసతి గృహాలకు తరలించారు. ప్రతి ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించి, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక సబ్జెక్టు ఉపాధ్యాయులతో 'డయల్ యువర్ సబ్జెక్టు టీచర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## '108' అంబులెన్స్ ఉద్యోగులకు జీతాలు పెంపు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** అత్యవసర వేళ ఆపద్బాంధవులుగా సేవలందిస్తున్న 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్ ఉద్యోగులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారికి రూ.5వేలు చొప్పున జీతం పెంచింది. అలాగే కొత్తగా చేరి.. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారికి రూ.2వేలు చొప్పున జీతం పెంచింది. దీంతోపాటు కొత్త వాహనాలు సమకూర్చింది. దీంతో ఉద్యోగులు, సిబ్బందిలో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో గతంలో 108, 104 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణను అరబిందో సంస్థ నిర్వహించేది. ఒక్కో ఉద్యోగికి రెండు నెలల వేతనం, ఇంక్రిమెంట్లు, సెలవులకు సంబంధించి రూ.60వేల నుంచి రూ.90వేలు చొప్పున బకాయి ఉంది. సకాలంలో జీతాలు కూడా చెల్లించకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించింది. భవ్య అనే కొత్త సంస్థకు నిర్వహణ బాధ్యత అప్పగించింది. గతంలో రూ.2వేలు చొప్పున వేతనాలు పెంచింది. తాజాగా కొత్త వాహనాలతో పాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు మరోసారి పెంచింది. జిల్లాలో ప్రస్తుతం 108 అంబులెన్స్‌లు 30 ఉన్నాయి. అదనంగా మరో మూడు వాహనాలు సమకూర్చారు. 104 వాహనాలు మండలానికి ఒకటి చొప్పున ఉంది. వీటితోపాటు సీహెచ్‌సీలో తల్లీబిడ్డల వాహనాలు ఏర్పాటు చేశారు. 108 అంబులెన్స్ వాహనాలకు సంబంధించి 270 మంది సిబ్బంది ఉన్నారు. 104 వాహనాలతోపాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. గతంలో ప్రతినెల పైలట్‌కు రూ.18వేలు జీతం ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.23వేలు జీతం వస్తోంది. గతంలో ఈఎంటీకి రూ.20వేలు ఉండగా.. దానిని రూ.25వేలకు పెంచారు. పెంచిన జీతాలు ఈ నెలలో బ్యాంకు ఖాతాలో జమకావడంతో ఉద్యోగులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో 108 వాహన ఈఎంటీలు, పైలెట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు 'థాంక్యూ సీఎం సార్' అంటూ ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఐదు నుంచి పదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారికి శ్లాబ్ అప్‌గ్రేడేషన్ చేయడంపై హర్షం వెలిబుచ్చారు. మెళియాపుట్టిలో కూడా సిబ్బంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పైలెట్లు బి.శేఖర్, ఆనంద్, విశ్వనాథం, ఈఎంటీలు సూర్యనారయణ, ఉపేంద్ర, సరోజిని పాల్గొన్నారు.

## సాంకేతికతపై పట్టు సాధించండి: ఐజీ



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సమాజంలో పెరిగిపోతున్న సాంకేతిక ఆధారిత నేరాలను (సైబర్ క్రైమ్స్) సమర్థంగా ఎదుర్కొనేందుకు ట్రైనీ కానిస్టేబుళ్లు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి పిలుపునిచ్చారు. జిల్లాలోని తండేంవలస పోలీసు శిక్షణ కేంద్రం (పీటీసీ)లో జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అక్కడ శిక్షణ పొందుతున్న స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఐజీ మాట్లాడుతూ 9 నెలల పాటు జరిగే ప్రాథమిక శిక్షణ ఎంతో కీలకమైందన్నారు. ఈ సమయాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక దర్యాప్తు పద్ధతులు, డిజిటల్ సాక్ష్యాధారాల సేకరణలో మెలకువలు నేర్చు కోవాలన్నారు. విధి నిర్వహణలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో సమస్యలు ఉంటే నిర్భయంగా ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఉత్తమ సేవలందించే బాధ్యతాయుతమైన పోలీసులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కలసి శిక్షణ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, బ్యారెక్స్, మెస్, వంటగదిని తనిఖీ చేసి, ట్రైనీలకు అందుతున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ గోవిందరావు, శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 15 నుంచి 18 వరకు మహాశివరాత్రి వేడుకలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ముఖలింగ క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 15 నుంచి 18 వరకు వేడుకలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితోపాటు స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పర్యటించి.. ఆలయంలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. 15న మహాశివరాత్రి జాగరం, 16న పడియా, 17న మహాపడియా, 18న వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు. చక్రతీర్థ స్నానాలకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారు. పరమ శివుడు ముఖాకృతి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న ఏకైక ఆలయం శ్రీముఖలింగం. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే ముక్తికి మార్గం దొరుకుతుందని భక్తుల విశ్వాసం. ఈ ఆలయం శ్రీకాకుళానికి 50 కి.మీ దూరంలో జలుమూరు మండలం శ్రీముఖలింగంలో పవిత్ర వంశధార నది ఒడ్డున విలసిల్లి ఉంది. క్రీ.శ.720 నుంచి 1450 వరకు రాజ్యం చేసిన గంగవంశీకులైన ఒకటవ కామార్ణవునితో ఈ ఆలయం నిర్మాణం ప్రారంభమైనట్లు శాసనాలు ఆధారంగా తెలుస్తోంది. క్రీ.శ.14వ శతాబ్దంలో శిథిలమైన ఆలయాన్ని పర్లాకిమిడి ప్రభువు శ్రీవిష్ణువర్ధన మధుకర్ల గజపతి పునరుద్ధరించినట్టు తెలుస్తోంది. ఈ ఆలయంపై అద్భుత శిల్పాలు మనకు దర్శనమిస్తాయి. శ్రీముఖలింగంలో మూడుచోట్ల ముక్కోణం ఆకారంలో మూడు ఆలయాలు వున్నాయి. వాటిలో ప్రధాన ఆలయం మధుకేశ్వరాలయం. దీనికి అభిముఖంగా కొంతదూరంలో భీమేశ్వర ఆలయం ఉంది. ఈ రెండు ఆలయాలకు కాస్తదూరంగా ఊరి ప్రారంభంలో అధునాతన వాస్తు పద్ధతిలో అద్భుత సోయగాలు కురిపిస్తూ సోమేశ్వరాలయం సందర్శకులకు ఆహ్వానం పలుకుతోంది.

## అంతర్జాతీయ కాఫీ ఫెస్ట్‌లో ప్రత్యేక ఆకర్షణగా అరకు కాఫీ



**అరకు, పతాకం న్యూస్:** బెంగళూరులో జరిగిన ఇండియన్ అంతర్జాతీయ కాఫీ ఫెస్ట్‌లో అరకు కాఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశ. విదేశీ కాఫీప్రియులు అరకు కాఫీ రుచులను ఆస్వాదించారు. కేంద్ర కాఫీ బోర్డు, స్పెషలిటీ కాఫీ అసోసియేషన్ ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరులో ఇండియన్ అంతర్జాతీయ కాఫీ ఫెస్ట్ నిర్వహిస్తున్నది. ఈఫెస్ట్‌లో దేశ వ్యాప్తంగా సాగు చేస్తున్న కాఫీ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఫెస్ట్‌కి దేశ, విదేశీయులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ ఫెస్టులో కేంద్ర కాఫీ బోర్డు సహకారంతో ఆంధ్రప్రదేశ్ నుంచి చింతపల్లి మండలం దిగువపాకలు గ్రామంలో పనిచేస్తున్న ఎం.నిట్టపుట్టు రైతు ఉత్పత్తిదారుల సంఘం అరకు కాఫీ స్టాల్‌ని ఏర్పాటు చేసింది. అరకు కాఫీ ఉత్పత్తులు, తాజా కాఫీని అతిథులకు అందిస్తున్నారు. దేశవిదేశీయులు అరకు కాఫీ స్టాల్ వద్ద కాఫీ తాగేందుకు అమితాసక్తి చూపుతున్నారని మినుములూరు సీనియర్ లైజనింగ్ అధికారి ఎస్. రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో గంగరాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి

**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలంలోని తుమ్మపాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతిచెందగా, ఆయన సోదరుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ శేషగిరిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం బవులవాడకు చెందిన సంబకాయల అప్పల సూర్యప్రకాశరావు (48) హైదరాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో ఏపీవోగా పనిచేస్తున్నారు. కుటుంబం విశాఖ నగరం సింహాచలం ప్రాంతంలోని సింహపురి కాలనీలో నివాసం ఉంటోంది. హైదరాబాద్ నుంచి సెలవుపై విశాఖపట్నం వచ్చిన ఆయన...గురువారం బవులవాడ గ్రామదేవత పండగకు హాజరయ్యేందుకు తన తమ్ముడు దుర్గారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తుమ్మపాల సమీపాన వీరి వాహనాన్ని చోడవరం వైపు నుంచి అనకాపల్లి వస్తున్న మినీ బస్సు ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న అప్పల సూర్యప్రకాశరావు ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న దుర్గారావు కూడా గాయపడ్డాడు. ఇద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. సూర్యప్రకాశరావు చికిత్స పొందుతూ మృతిచెందారు.

# ఏపీ ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్లు వచ్చేశాయ్ ..!



**అమరావతి, పతాకం న్యూస్:** ఎపి ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్లు వచ్చేశాయ్. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ షురూ అవుతాయి. మార్చి 24వ తేదీ నాటికి అన్ని పరీక్షలు పూర్తి కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహిస్తారు. ఎపి ఇంటర్మీడియట్ విద్యార్థులు https:bie.ap.gov.in వెబ్ సైట్ నుంచి లేదా మనమిత్ర వాట్సాప్ (9552300009) ద్వారా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు. చాలా సులభంగా వీటిని పొందే అవకాశం ఉంది. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పదో తరగతి హాల్ టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం వారు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, కళాశాల స్టాంప్ అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఎపి ప్రభుత్వం తీసుకువచ్చిన మనమిత్ర వాట్సాప్ ద్వారా ఈ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ముందుగా 9552300009 వాట్సప్ నంబర్‌కు నఆ అని మెసేజ్ సెండ్ చేయాలి. 'ఎడ్యుకేషన్ సర్వీసెస్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇక్కడ మీ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్ కాపీని పొందవచ్చు.

# కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో లావు శ్రీకృష్ణ దేవరాయలు భేటీ.. పలు అంశాలపై చర్చ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తోతెలుగుదేశం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కొండవీడు కోట వారసత్వ అభివృద్ధి ప్రాజెక్ట్ కోసం స్వదేశ దర్శన్ స్కీమ్ 2.0 కింద నిధులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ వారసత్వ పరిరక్షణ, పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ ఎంతో కీలకమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొండవీడు కోట అభివృద్ధి ప్రాజెక్ట్ డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై వెంటనే నిర్ణయం తీసుకుని నిధులను విడుదల చేయాలని కోరారు.

# తాగునీటి సమస్యపై అసెంబ్లీలో తన స్వరాన్ని వినిపించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



**అమరావతి, పతాకం న్యూస్:** రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో ఏర్పడుతున్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో తన స్వరాన్ని విన్నవించారని ఆత్మకూరు మండల టిడిపి బోయ గంతి శ్రీనివాసులు మండల ప్రజలకు తెలిపారు. రాబోతున్న వేసవి కాలనీ దృష్టిలో ఉంచుకుని,బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో జీరో అవర్ సమావేశంలో ఎమ్మెల్యే సునీతమ్మ అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్య గురించి తన వాదను వినిపించారు . రాప్తాడు నియోజకవర్గం లోని పై రెండు మండలాల్లో సుమారు 600కు పైగా గ్రామాల్లో త్రాగునీటి సమస్య మేలుకొని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని,అనంతపురం రూరల్ మండలం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని,ఇప్పుడు వస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. అందుకే ప్రభుత్వం 90కోట్ల జల జీవన్ మిషన్ నిధులతో పీఏబిఆర్ నుంచి తాగునీటి పైప్ లైన్, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టారన్నారు. మెయిన్ పైప్ లైన్ అనంతపురం వరకు పూర్తి అయిందని.. ఇంకా కొంతవరకు పనులు చేయాల్సి ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు మంజూరు చేయకపోవడం వలన పనులు ఆగిపోయాయన్నారు.ఇదే పరిస్థితి మరిన్ని రోజులు జరిగితే. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య ఎక్కువయ్యే అవకాశం అధికంగా ఉన్నాయన్నారు. కాబట్టి,. ఇప్పటికే 70శాతం వరకు పనులు పూర్తయ్యాయని.. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సంబంధిత బిల్లులను మంజూరు చేయాలని రాష్ట్ర అధిష్టానాన్ని కోరారు. పెండింగ్ పనులు కూడా పూర్తి చేసి అనంతపురం రూరల్ ఆత్మకూరు మండలాల్లో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో త్రాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం హంద్రీనీవా నీరు రాని ప్రాంతంలో వెయ్యి అడుగులు బోరు వేసినా నీరు పడటం లేదన్నారు. ఈ పరిస్థితి గమనించి.. నీటి సమస్యపై సత్వరమే స్పందించాలని ఎమ్మెల్యే సునీతమ్మ శాసన సభ అధిష్ఠానికి విజ్ఞప్తి చేశారని మండల బోయ గంతి శ్రీనివాసులు పేర్కొన్నారు.

# స్మార్ట్ మీటర్లపై అవగాహన




**అమరావతి, పతాకం న్యూస్:** ఒకప్పుడు కరెంటు బిల్లు ఎంత వస్తుందో తెలియక, రీడింగ్ తీసే వ్యక్తి ఎప్పుడు వస్తాడో అని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు కాలం మారింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థ స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి కరెంటు వినియోగదారుడు ఇకపై తన విద్యుత్ ఖర్చును తానే నియంత్రించుకోవచ్చు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ఈ నెల 23 వరకు ప్రత్యేక అవగాహన వారోత్సవాలను ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో జరపాలని నిర్ణయించారు. ప్రచార రథాలు, కరపత్రాల ద్వారా క్షేత్రస్థాయిలో వినియోగదారులకు స్మార్ట్ మీటరు టెక్నాలజీని వివరిస్తున్నారు. వాడకం పెరిగితే యాప్ ద్వారా హెచ్చరికలు: స్మార్ట్ మీటర్ అంటే కేవలం మీటర్ మార్చడం కాదు, అది మీ స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానం అవుతుందని తెలియజేస్తున్నారు. ఏపీసీపీడీసీఎల్ స్మార్ట్ మీటర్ యాప్‌తో ద్వారా రోజుకు ఎంత కరెంటు ఖర్చవుతుందో ఎప్పటికప్పుడు చూసుకోవచ్చంటున్నారు. వాడకం పెరిగితే యాప్ ద్వారా హెచ్చరికలు అందుతా యన్నారు. తద్వారా అనవసరంగా వెలిగే ఫ్యాన్లు, లైట్లను ఆపి బిల్లు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. ఫోన్ ప్రీపెయిడ్ రీఛార్జ్? మాదిరిగానే ముందుగా కొంత నగదు రీఛార్జ్ చేసుకుంటే, ఆ మేరకు విద్యుత్ అందుతుందంటున్నారు. దాంతో నెల నెలా భారీ బిల్లులు చూసి షాక్ అయ్యే పని ఉండదని చెబుతున్నారు.

రోజుకు ఎంత కరెంటు ఖర్చవుతుందో చూసుకోవచ్చు మనుషుల ప్రమేయం లేకుండానే రీడింగ్: గతంలో రీడింగ్ తీయడంలో పొరపాట్లు జరగడం వల్ల వినియోగదారులు ఇబ్బంది పడేవారు. స్మార్ట్ మీటర్లలో మనుషుల ప్రమేయం లేకుండానే రీడింగ్ నేరుగా సర్వర్‌కు చేరుతుందని దీనివల్ల నూరు శాతం ఖచ్చితమైన బిల్లింగ్ సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ "ఆర్?డీఎస్?ఎస్ ?స్కీమ్"? ద్వారా ఈ మీటర్ల ఏర్పాటును వేగవంతం చేసిందని పాత మీటర్లను తొలగించి కొత్తవి అమర్చేందుకు వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుము తీసుకోరని వివరిస్తున్నారు. స్మార్ట్ మీటర్ అంటే విద్యుత్ భారం కాదు, అది వినియోగదారుడికి లభించే అధికారం అని విద్యుత్తుశాఖ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ పొదుపు చేయడమే కాకుండా, పారదర్శకమైన సేవలను పొందడానికి ఈ స్మార్ట్ మీటర్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హైక్వాలిటి, హై అక్యురసీ ఈ స్మార్ట్ మీటర్లలో ఉంటాయి. పాత మీటర్లలాగా నడుస్తూ నడుస్తూ కాలిపోవడం, ఆగిపోవడం స్మార్ట్ మీటర్లలో ఉండదు. ఈ స్మార్ట్ మీటర్లలో 100 యూనిట్లు కాలిస్తే 100 మీటర్లు మాత్రమే రికార్డు అవుతుంది. ఎక్కువ కరెంటు బిల్లులు వచ్చే పరిస్థితి ఉండదు. స్మార్ట్? మీటర్లలో ఉన్న సదుపాయం ఏంటంటే రోజు ఎన్ని యూనిట్లు వాడామని మొబైల్? ద్వారా చూసుకునే వెసులుబాటు ఇందులో ఉంటుంది. అదే పాత మీటర్ల ద్వారా అయితే నెలకి ఒకసారి మాత్రమే చూసుకోవచ్చు. ఈ స్మార్ట్ మీటర్లలో ఉన్న ఇంకో సదుపాయం ఏంటంటే సోలార్ పవర్ పెట్టించుకున్నప్పుడు మళ్లీ నెట్? మీటర్లు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు.ఈ స్మార్ట్ మీటర్లనే నెట్ మీటర్లుగా వాడుకోవచ్చు. స్మార్ట్ మీటర్లతో 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆ నెల రీడింగ్ క్లోజ్ అవుతుంది. 250, 300 యూనిట్లు ఇలా ఎన్ని యూనిట్లు వాడుకోవాలనే నియంత్రణ ఈ స్మార్ట్ మీటర్లలో ఉంటుంది. దుబారా విద్యుత్ వినియోగాన్ని వీటితో అరికట్టవచ్చు. గంట గంటకి మనం వాడిన విద్యుత్ వినియోగం సర్వర్‌కి వెళ్లిపోతుంది. మీటర్ పనిచేయకపోతే వాటిని రిపేర్ చేయడానికి ఎలాంటి సర్వీస్ రుసుము వసూలు చేయం. మీటర్ రీడింగ్ ఎక్కువగా తిరగడం అనేది అపోహ మాత్రమే అని విద్యుత్తుశాఖ డీఈ రవీంద్ర తెలియజేశారు.

# ముందుకుసాగని 'యూనిటీ మాల్' నిర్మాణం!

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భీమిలి బీచ్‌రోడ్డులో రామానాయుడు స్టూడియో సమీపాన ఐదు ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన 'యూనిటీ మాల్' నిర్మాణం పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి. మొదటి నుంచి దీని గురించి పట్టించుకునే వారే కరవయ్యారు. గత ఏడాది మే నెలలో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొండను కొద్దిగా తవ్వి చుట్టూ రేకులతో ప్రహరీ నిర్మించారు. అక్కడితో సరి. లోపల ఏ పనులు చేయడం లేదు. అటు చూస్తే ఢిల్లీలో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు మార్చి నెలాఖరుకే పూర్తి అయిపోతుందని సమాధానం చెబుతున్నారు. కానీ ఇక్కడి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. సుమారు రూ. 172 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ మాల్‌కు తొలి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ. 86 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులను మార్చి నెలాఖరులోగా ఉపయోగించుకోకపోతే మురిగిపోయే ప్రమాదం ఉంది. దీనిపై ఎంపీ తగిన శ్రద్ధ చూపకపోతే మిగిలిన నిధులు కూడా ఆగిపోయే ప్రమాదం ఉంది.




దేశంలో చేతివృత్తి పనివారికి ప్రత్యేక ఉపాధి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తూ, వారి నైపుణ్యానికి ప్రచారం కల్పించాలనే లక్ష్యంతో యూనిటీ మాల్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2023 బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి ప్రతి రాష్ట్రానికి ఒకటి చొప్పున మంజూరుచేశారు. ఏపీకి సంబంధించిన మాల్‌ను విశాఖలో ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, చేతివృత్తులు, కళాకృతులను ఇక్కడ విక్రయించుకునేందుకు వీలుగా నిర్మాణం డిజైన్ చేశారు. మొత్తం 36 షాపులు, ఫుడ్ కోర్టులు, ప్రదర్శనశాలలకు ప్లాన్ చేశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో 3.5 లక్షల చ.అ. విస్తీర్ణంలో గ్రౌండ్+4 అంతస్థులు నిర్మించడానికి ప్లాన్ ఆమోదించారు. అందులో 'ఒక జిల్లా...ఒక ఉత్పత్తి' నినాదంతో ఒక్కో జిల్లాకు ఒక్కో స్టాల్ ఇవ్వనున్నారు. ఉత్తరాంధ్రాకు సంబంధించి పొందూరు ఖాదీ, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక బొమ్మలు, మాడుగుల హల్వా, అరకు కాఫీ వంటివి విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తారు. శంకుస్థాపన చేసిన నాటి నుంచి 24 నెలల్లో పనులు పూర్తి చేయాలనేది నిబంధన. విశాఖలో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించి పది నెలలు అయింది. పునాదులు కూడా వేయలేదు. దీని నిర్మాణ బాధ్యతలను ప్రత్యేక అధికారికి అప్పగించి, నిత్యం పర్యవేక్షిస్తే తప్ప పనులు సకాలంలో పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు.

# 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించాలి: మండలిలో నాగబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** 16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... చిన్నారులు సైబర్ నేరాలు, ప్రమాదకరమైన ఆన్‌లైన్ ట్రెండ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో మంచి, చెడులను విశ్లేషించుకునే విచక్షణ పెద్దలకు ఉంటుందని, కానీ 16 ఏళ్ల లోపు పిల్లలకు ఆ పరిపక్వత ఉండదని నాగబాబు అన్నారు. గతంలో 'బ్లూ వేల్ చాలెంజ్' వంటి ప్రమాదకరమైన క్రీడలకు ఆకర్షితులై ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం 'మెమో చాలెంజ్', 'స్కల్ బ్రేకర్ చాలెంజ్', 'ఫైర్ చాలెంజ్' వంటి ప్రాణాంతకమైన సాహసాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయని, వాటికి ఆకర్షితులై కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలని నాగబాబు ప్రభుత్వానికి సూచించారు. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి పలు ఐరోపా దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐటీ, పోలీస్, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి సోషల్ మీడియా అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. హోం, ఐటీ, విద్యా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో కేవలం విద్యకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ట్యాబ్‌లలో సోషల్ మీడియా యాప్‌లను వాడకుండా పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పాఠశాలల్లో జరిగే పేరెంట్స్-టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని, తద్వారా చిన్నారుల భవిష్యత్తును కాపాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు ఆహారంలో మార్పులు చేసుకోవాలి



ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు ఆహారంలో విషయంలో ఈ మార్పులు తప్పక చేయాలి..! మన జీవన విధానంలో, ఆహారంలో వచ్చిన మార్పులు మనల్ని అనేక అనారోగ్య సమస్యల బారిన పడేలా చేస్తున్నాయి. వాటిలో ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఒకటి. ఈ సమస్య ఇప్పుడు సాధారణ సమస్యలాగా మారింది. ఫ్యాటీ లివర్ లో రెండు రకాలు ఉన్నాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. మన జీవన విధానంలో, ఆహారంలో వచ్చిన మార్పులు మనల్ని అనేక అనారోగ్య సమస్యల బారిన పడేలా చేస్తున్నాయి. వాటిలో ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఒకటి. ఈ సమస్య ఇప్పుడు సాధారణ సమస్యలాగా మారింది. ఫ్యాటీ లివర్ లో రెండు రకాలు ఉన్నాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. ఆల్కహాల్ తక్కువ తాగే వారిలో లేదా అసలు తాగని వారిలో కూడా మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను ముందుగా గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. ఈ సమస్యను కనుక నిర్లక్ష్యం చేస్తే ఇది కాస్తా నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్, సిర్రోసిస్ తో పాటు చివరగా కాలేయ క్యాన్సర్ గా మారే అవకాశం ఉంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా అవసరం.

మన రోజువారి అలవాట్లపై శ్రద్ధ పెట్టడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య క్యాన్సర్ గా మారకుండా మనం జాగ్రత్తపడవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడానికి, ఈ సమస్య రాకుండా నివారించడానికి మన జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. శీతల పానీయాలు, బిస్కెట్లు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్ వంటి వాటిని తీసుకోవడం మానేయాలి. ఇవి నేరుగా కాలేయంలో కొవ్వును పెంచుతాయి. చక్కెర కలిగిన పదార్థాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక వీటికి బదులుగా డ్రై ఫ్రూట్స్, కూరగాయలు, పండ్లు, తృణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. గంటల తరబడి కూర్చోకూడదు. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల జీవక్రియ మందగిస్తుంది. కాలేయంలో కొవ్వు పేరుకు పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక వారానికి 150 నిమిషాలు నడక, స్కైకింగ్, ఈత వంటి వ్యాయామాలు చేయాలి.

నూనెలో బాగా వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వేయించిన ఆహారాలు, పిజ్జాలు, బర్గర్లు వంటి వాటిలో ట్రాన్స్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలేయంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య తక్కువ సమయంలోనే కాలేయ క్యాన్సర్ గా మారే అవకాశం ఉంది. కనుక వీటికి బదులు ఆలివ్ ఆయిల్ తో చేసిన వంటకాలు తీసుకోవడం, చేపలు, అవకాడో వంటి వాటిని తీసుకోవడం చేయాలి. అలాగే శరీర బరువును కూడా అదుపులో ఉంచుకోవాలి. అధిక శరీర బరువు ఫ్యాటీలివర్ సమస్య రావడానికి ప్రధాన కారణం. అధిక బరువు, పొట్ట చుట్టూ ఎక్కువగా పేరుకుపోయిన కొవ్వు ఇన్సులిన్ నిరోధకతను, ఫ్యాటీ లివర్ సమస్యను పెంచుతుంది. కనుక శరీర బరువును ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి.

ఎక్కువగా నీరు తాగడం, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయడం వల్ల శరీర బరువు ఎల్లప్పుడూ అదుపులో ఉంటుంది. ఇక మద్యపానం, ధూమపానం రెండూ కూడా ఫ్యాటీ లివర్ కు దారి తీస్తాయి. ఇవి రెండూ కాలేయానికి ప్రధాన శత్రువులు అని చెప్పవచ్చు. ఈ అలవాట్లను కొనసాగించడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్యతో పాటు కాలేయ క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక ఈ అలవాట్లను వెంటనే మానేయడం మంచిది. వీటికి బదులుగా నీటిని ఎక్కువగా తాగడం, బ్లాక్ టీ, హెర్బల్ టీలను తాగడం అలవాటు చేసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్య నెమ్మదిగా ప్రమాదంగా మారే అవకాశం ఉంది. కనుక మన రోజూ అలవాట్లల్లో ఈ మార్పులు తప్పకుండా చేసుకోవాలి. ఈ అలవాట్లను పాటించడం వల్ల కాలేయ ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

# 'మోచేతులు నల్లగా ఉన్నాయా?'



అందంగా, యవ్వనంగా, కోమలంగా మెరిసే చర్మం కావాలని కోరుకోనివారు ఎవరైనా ఉంటారా అందుకే, అమ్మాయిలు ముఖంతో పాటు పాదాలు, చేతుల విష యంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ క్రమంలో తరచూ పార్లర్‌లో పెడిక్యూర్, మానిక్యూర్ చేయించు కుంటారు. అయితే, ఇంత చేసినా కొందరిలో మోచేతులు, మోకాళ్లు, కాలిమడమలపై చర్మం నల్లగా, గరుకుగా మారుతుంది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకునే మార్గాలు మన ఇంట్లోనే బోలెడున్నాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! ఆరోగ్యం, అందానికి మేలు చేసే పదార్థాల్లో కలబంద ముందు వరుసలో ఉంటుందని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఉపయోగించి మోచేతులు, మోకాళ్ల నలుపును సులభంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. దీనికోసం కలబంద గుజ్జును మోచేతులు, మోకాళ్లపై నల్లగా ఉన్న చోట రాసుకోవాలని, ఆ తర్వాత ఇరవై నిమిషాల పాటు ఆరనిచ్చి, గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుందని సూచిస్తున్నారు. ఇలా రోజుకి రెండు సార్లు క్రమం తప్పకుండా చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుందని అంటున్నారు. కలబందలో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా చేయడంతో పాటు మృదువుగా మార్చుతాయని వివరిస్తున్నారు. కొందరిలో మోచేతుల దగ్గర చర్మం మరీ నల్లగా ఉంటుంది. అలాంటి వారు చక్కెర ఉపయోగిస్తే చక్కని ఫలితం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. దీనికోసం ఒక టీస్పూన్ ఆలివ్ నూనెలో కొద్దిగా చక్కెర వేసి బరకగా ఉన్న మిశ్రమంలా కలుపుకోవాలని చెబుతున్నారు. దీన్ని నల్లగా మారిన మోచేతులపై రాసుకొని 10-15 నిమిషాల పాటు మర్దన చేసుకుని, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. చక్కర మంచి స్క్రబ్‌లా పని చేసి మృతకణాలను తొలగిస్తుందని, ఆలివ్ నూనె చర్మం మృదువుగా మారేందుకు తోడ్పడుతుందని పేర్కొంటున్నారు. ఇలా రోజుకోసారి చేస్తే క్రమంగా మోచేతులపై నలుపు కనుమరుగవుతుందని తెలియజేస్తున్నారు.

ఇందులో ఉండే విటమిన్లు, ఇతర పోషకాలు చర్మానికి పోషణనందించి మృదువుగా మారుస్తాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ స్నానం చేసిన వెంటనే మోచేతులు, మోకాళ్లపై కాస్త కొబ్బరినూనె రాసుకొని రెండు నిమిషాల పాటు మర్దన చేసుకోవాలని తెలియజేస్తున్నారు. ఇలా రోజూ చేయడం వల్ల అక్కడి చర్మం మృదువుగా తయారవుతుందని పేర్కొంటున్నారు. కొబ్బరినూనెలో అర టీస్పూన్ నిమ్మరసం వేసి బాగా కలుపుకుని, ఆ మిశ్రమాన్ని మోచేతులకు రాసుకొని 15-20 నిమిషాల పాటు మర్దన చేసుకోవాలని తెలియజేస్తున్నారు. తర్వాత టిష్యూ పేపర్‌తో తుడిచేసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఇలా తరచూ చేస్తూ ఉంటే మోచేతులపై ఉన్న నలుపు క్రమంగా మాయమవుతుందని అంటున్నారు. నిమ్మ, మంచి క్లెన్సర్‌గా పనిచేసి మృతకణాలను సమర్థంగా తొలగిస్తుందని చెబుతున్నారు. ఇందుకోసం నిమ్మచెక్కను తీసుకొని మోచేతులపై నలుపుగా ఉన్న చోట కాసేపు రుద్ది, ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకోవాలని పేర్కొంటున్నారు. ఇలా రెండు రోజులకోసారి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని అంటున్నారు. నిమ్మచెక్కను ఉప్పులో ముంచి రుద్దినా మోచేతులపై ఉన్న నలుపును తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ఒక గిన్నెలో రెండు టీస్పూన్ల పెరుగు, కొద్దిగా వైట్ వెనిగర్ తీసుకొని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని నల్లగా మారిన మోచేతులకు, మోకాళ్లకు రాసుకోవాలని అంటున్నారు నిపుణులు. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకుని, టవల్‌తో పొడిగా తుడుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే నలుపుదనం తగ్గుతుందని వివరిస్తున్నారు.

# అధ్వానంగా జగనన్న లేఅవుట్లు

## మౌలిక వసతులు కరువు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల కోట్లాది రుపాయల నిధులు వృథా అయ్యాయి. జగనన్న కాలనీల పేరిట గ్రామాలు, పట్టణాలకు దూరంగా.. నిర్మాణాలకు అనువుగా లేని స్థలాలను అప్పట్లో పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున నగదు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి. కాగా ఆయా లేఅవుట్లలో మౌలిక వసతులేవీ కల్పించకపోవడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముం దుకు రాలేదు. దీంతో నేటికీ ఆయా స్థలాలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. మొత్తంగా పేదల సొంతింటి కలను నెరవేర్చలేకపోయారు.

పార్వతీపురం డివిజన్‌లో 53 ఎకరాల 76 సెంట్లను 85 మంది భూ యజమానులు నుంచి అప్పట్లో కొనుగోలు చేశారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.3.32కోట్లు, పార్వతీపురం, సాలూరు పట్టణ ప్రాంతాల ప్రజలు రూ.7.05 కోట్లు వెచ్చించారు. ఇది కాకుండా 165 మంది నుంచి సుమారు 112 ఎకరాల 38 సెంట్ల డీపట్టా భూములను కొనుగోలు చేశారు.

ఇందుకోసం రూ.2.63 కోట్లు చెల్లించారు. పార్వతీపురం మండలం నర్సిపురం, పెదమరికి పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూములను ప్లాట్లుగా విభజించి.. అప్పట్లో లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. అయితే ఆయా స్థలాలు నిర్మాణాలకు అనుకూలంగా లేకపోవంతో ఇళ్లు కట్టుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం తూరుమామిడి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడి పేదలకు కేటాయించిన స్థలాలు నేటికీ ఖాళీగానే ఉన్నాయి. పాలకొండ డివిజన్‌లో వీరఘట్టం, భామిని, పాలకొండ మండలాల్లోని జగనన్న కాలనీల్లోనూ ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదు. జిల్లాలోని జగన్న కాలనీల్లో 381 లేఅవుట్లు వేయగా.. అందులో 5092 మంది కూడా పూర్తిస్థాయిలో ఇళ్లు నిర్మించుకోలేకపోయారు.

## ఏపీ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, పతాకం న్యూస్:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, దాని ద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. యువత వ్యవసాయం వైపు మళ్లాలంటే రంగం లాభదాయకంగా మారాలని మంత్రి చెప్పుకొచ్చారు. అధిక పోషక విలువలు ఉండే పంటల సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం కల్పిస్తామని చెప్పారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతం ఉందని, 11 పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని వెల్లడించారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధించిందని తెలిపారు. పంటలను కాపాడేందుకు రైతులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు మంత్రి. ప్రభుత్వం రైతులకు వివిధ రూపాల్లో సాయం అందిస్తోందని వివరించారు. 24 గంటల్లో 9 వేల కోట్ల రూపాయలకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.6,309 కోట్లు చెల్లించామన్నారు. 2026-27లో దానిని రూ.6,600 కోట్లకు పెంచామని చెప్పారు. ధాన్యం సేకరణ బకాయిలుగా రూ.1,674 కోట్లు చెల్లించామని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా 6 లక్షల భూసార పరీక్ష పత్రాలు అందజేశామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందించామని పేర్కొన్నారు. పెట్టుబడి రాయితీ కింద రూ.310 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. యాంత్రీకరణలో 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు కేటాయించామని వివరించారు. 80 శాతం రాయితీతో రూ.90.4 కోట్లతో.. 1,130 డ్రోన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతేడాది రూ.182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా చేశామని మంత్రి పేర్కొన్నారు.




## మాకు భారత్‌పై మంచి రికార్డేమీ లేదు: పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా




భారత క్రికెట్ జట్టుపై తమకు మంచి రికార్డు ఏమీ లేదని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా అన్నాడు. గత చరిత్రను తాము మార్చలేమని, కానీ ఈ మ్యాచ్‌లో మాత్రం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని అన్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా కొలంబో వేదికగా ఆదివారం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో సల్మాన్ అలీ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత క్రికెటర్ అభిషేక్ శర్మ గురించి కూడా సల్మాన్ అలీ స్పందించాడు. అభిషేక్ మంచి ఆటగాడని కితాబిచ్చాడు. అత్యుత్తమ జట్టుతో ఆడాలని తాము కోరుకుంటున్నామని అన్నాడు. అభిషేక్ శర్మ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామని అన్నాడు. కాగా, టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్, పాకిస్థాన్ ఎనిమిదిసార్లు తలపడగా, ఏడుసార్లు టీమిండియా, ఒకసారి దాయాది దేశం గెలిచింది.

## నేడు దాయాదుల మధ్య కీలక పోరు



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా పాకిస్థాన్‌తో జరగనున్న కీలక మ్యాచ్ కోసం భారత క్రికెట్ జట్టు శ్రీలంకకు బయల్దేరింది. ఆదివారం కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. భారత ఆటగాళ్లు, వారి కుటుంబసభ్యులు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొలంబోకు విమానంలో పయనమయ్యారు. గ్రూప్ 'ఏ'లో ఉన్న భారత్, పాకిస్థాన్ జట్లు ఇప్పటివరకు ఆడిన రెండేసి మ్యాచ్‌లలోనూ విజయం సాధించాయి. సూపర్ 8కు అర్హత సాధించే క్రమంలో ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం. ఇందులో గెలిచిన జట్టు గ్రూప్ టాపర్‌గా నిలవడంతో పాటు, తర్వాతి దశకు మెరుగైన ఆత్మవిశ్వాసంతో వెళ్లే అవకాశం ఉంది. ఈ టోర్నీలో భారత్ తన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో, రెండో మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు పాకిస్థాన్ నెదర్లాండ్స్, అమెరికా జట్లను ఓడించింది. అయితే, ఈ మ్యాచ్ నిర్వహణపై గతంలో అనిశ్చితి నెలకొంది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం మొదట ప్రకటించింది. ఐసీసీతో జరిపిన చర్చలు, మ్యాచ్ రద్దయితే భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని శ్రీలంక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తితో పాక్ చివరకు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దీంతో దాయాదుల పోరుకు మార్గం సుగమమైంది.




# విశ్వక్‌సేన్ 'ఫంకీ'

## మూవీ రివ్యూ




యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న విశ్వక్‌సేన్ కథానాయకుడిగా 'జాతిరత్నాలు' వంటి బ్లాక్‌బాస్టర్ చిత్రానికి దర్శకుడైన కె.వి.అనుదీప్ దర్శకత్వంలో సినిమా అనగానే 'ఫంకీ'పై ఆడియన్స్‌లో ఓ పాజిటివ్ బజ్ మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక నిర్మాణం సంస్థ సితార ఎంటర్‌టైన్మెంట్స్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందనే అంచనాలో ప్రేక్షకులు ఉన్నారు. మరి అందరి అంచనాలనూ 'ఫంకీ' అందుకున్నదా? కె.వి.అనుదీప్ 'జాతిరత్నాలు' లాంటి మ్యాజిక్ మళ్లీ చేశాడా? విశ్వక్‌సేన్‌ని విజయం వరించిందా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకి వెళ్లాలి..

కోమల్(విశ్వక్‌సేన్) దర్శకుడిగా తొలి సినిమా చేస్తుంటాడు. అనుకున్న దానికంటే బడ్జెట్ పెంచేయడంతో అవకాశం ఇచ్చిన నిర్మాత అనారోగ్యపాలవుతాడు. తన తండ్రిని ఈ స్థితికి తెచ్చిన కోమల్‌పై నిర్మాత కూతురు చిత్ర(కయాదు లోహర్)కి చెప్పలేనంత కోపం వస్తుంది. కోమల్‌ని దర్శకుడిగా తీసేస్తుంది. సినిమా ఆపేస్తుంది. ఇక ఎలాగొలా చిత్ర కోపాన్ని తగ్గించి సినిమాలు మళ్లీ మొదలుపెట్టాలని కోమల్ శతవిధాలా ప్రయత్నిస్తుంటాడు. ఓ దశలో చిత్ర ఒప్పు కుంటుంది. మిగిలిన సినిమాను తాను చెబుతున్న బడ్జెట్‌లో కాకుండా కేవలం కోటి రూపాయల్లో పూర్తి చేయాలనే షరతుతో సినిమాను మళ్లీ మొదలు పెడుతుంది చిత్ర. ఈ ప్రయాణంలో కోమల్, చిత్ర మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఇంతకీ కోమల్ అనుకున్న బడ్జెట్‌లో సినిమా పూర్తి చేయ గలిగాడా? నిర్మాత కుమార్తె చిత్రను పెళ్లాడగలిగాడా? సినిమా తెరకెక్కించే క్రమంలో కోమల్‌కు ఎదురైన సమస్య లేంటి? వాటిని తను ఎలా అధిగమించాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



దర్శకుడు అనుదీప్ కేవలం నవ్వించడానికే ఈ సినిమా తీసినట్టు అనిపిస్తుంది. కథలో కామెడీ ఉండాలి కానీ.. సినిమానే కామెడీ కాకూడదు. ఓ సింపుల్ లైన్‌ని సినిమాగా తీసుకొని ఫన్ మోడ్‌లో సినిమా అంతటినీ నడిపించాడు దర్శకుడు అనుదీప్. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలతో పాటు మధ్య వచ్చి వెళ్లిపోయే పాత్రలు సైతం సైటైర్లు వేస్తుంటాయి. దీనికోసం దర్శకుడు రాసుకున్న ఫన్నీ వన్‌లైనర్లు కొన్ని చోట్ల బాగానే పేలాయి. ఈ కథలో హీరోయిన్‌ని హీరో ప్రేమిస్తాడు. కానీ అమ్మతో కాసేపు ఫోన్లో మాట్లాడటాన్ని మాత్రం గలీజుగా ఫీలవుతాడు. బంధాలంటే అతనికి గలీజు. అది తప్పని హీరోయిన్‌ని ప్రేమించిన తర్వాత తెలుసుకుంటాడు. దీన్ని బట్టి హీరో పాత్ర చిత్రణని అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా దర్శకుడు అనుదీప్ ఈ కథలో బంధాలకు విలువివ్వాలని చెప్పాడు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమ ఉంటుంది.. కానీ వ్యక్తపరచుకునే అవకాశం, సందర్భం వారిద్దరికీ రాదు. ఈ నేపథ్యంలో ఇద్దరూ పడిన అంతర్మథనం బావుంది. అక్కడక్కడ దిల్‌రాజు, నాగవంశీ, కల్యాణ్‌కృష్ణ, హరీష్‌శంకర్, చిత్ర దర్శకుడు కె.వి.అనుదీప్.. వీరంతా సందర్భానుసారం అలా కనిపించి, ఇలా మాయమై సినిమాకు నిండుదనాన్ని తెచ్చారు. మొత్తంగా సినిమా ఆద్యంతం నవ్విస్తూ, నవ్వించడానికి ప్రయత్నిస్తూ సాగింది..

విశ్వక్‌సేన్ ఎప్పటిలాగే తనదైన జోష్‌తో ఆకట్టుకుంటాడు. ఈ కథలో ఆయన కొత్తగా చేయడానికి ఏం లేదు. ఉన్నంతలో బాగా చేశాడు. కథానాయిక కయాదు లోహర్ ఈ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్. తను చాలా అందంగా కనిపించింది. అంతే అందంగా నటించింది కూడా. నిర్మాత కూతురుగా ఆమె నటన ఈ సినిమాకు హైలైట్. ఇక నరేష్ ఎప్పటిలాగే తనదైన నటనా పటిమతో ఆడియన్స్‌ని కట్టిపడేస్తారు. మిచ్చి సంపత్ ఇందులో జీకే.. అనే కామెడీ విలన్‌గా కనిపిస్తారు. ఆయన కూడా అక్కడక్కడ నవ్విస్తారు. ఇక ఈ సినిమాలోని మిగతా తారాగణం కూడా పరిధిమేర రక్తికట్టించారు. కె.వి.అనుదీప్ సినిమా నేపథ్యంలో కూడిన కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ కథ రాసుకున్నాడు. కథలో ఇంకాస్త సీరియస్‌నెస్ ఉంటే బావుండేది. కథ ఆద్యంతం లైటర్‌వేలో సాగింది. కథలో సంఘర్షణలు తక్కువ. అక్కడక్కడ హీరోకు ఎదురయ్యే సమస్యలను కూడా కామెడీగా సాగాయి. మొత్తంగా ఆడియన్స్‌ని నవ్వించే విషయంలో కొంతమేర కె.వి.అనుదీప్ సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. భీమ్స్ సిసిరోలియో సంగీతం బావుంది. కెమెరా వర్క్ డల్‌గా అనిపించింది. కలర్ గ్రేడింగ్ సరిగ్గా చేస్తే బావుండేది. మొత్తంగా నిర్మాణ విలువలు బాగానే ఉన్నాయి. కామెడీ సినిమాలను ఇష్టపడే వాళ్లకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా నచ్చొచ్చు.

# 26న రష్మిక -విజయ్ దేవరకొండ వివాహం!



టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న త్వరలో పెళ్లిపీట లెక్కబోతున్నారు. ఈనెల 26న వీరి పెళ్లి ఉదరుపూర్‌లోని ఓ ప్యాలెస్‌లో జరగనుంది. ఈ జంటకు గతేడాది అక్టోబర్ 3న హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఈ వేడుకను నిర్వహించారు. ఉదరుపూర్‌లో జరగబోయే పెళ్లి కూడా ఇదే తరహాలో చేయటానికి ఇరుకుటుంబాల వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అనంతరం హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లుగా సమాచారం.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**